మౌలిక వసతులు కల్పిస్తాం

- నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- 5వార్డుల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రతి కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు 12, 13, 20, 38, 41వ వార్డుల పరిధిలో రూ.5,19,84,000 విలువ జేసే వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఏడాది కాలంలోనే రూ.120కోట్లతో వివిధ పనులు చేపట్టినట్లు తెలిపారు. మహిళల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని అన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకొచ్చారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, ముడా చైర్మన్ కె.లక్ష్మణ్‌యాదవ్, కౌన్సిలర్లు లక్ష్మీదేవి, ఉమర్‌పాషా, రావుల అనంతరెడ్డి, మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, ఎంఈ యు.బస్వరాజ్, డీఈఈ నర్సింహ, ఏఈ వైష్ణవి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, కాంగ్రెస్ నాయకులు యాదగిరిగౌడ్, అవేజ్, అజ్మత్ అలీ, షోయబ్, అర్షద్‌అలీ, దాసరి శ్యాముల్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- కలెక్టర్ విజయేందిర బోయి



సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో వంటగదిని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి

జెడ్పీసెంటర్(మహబూబ్ నగర్): విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శనివారం పిల్లలమర్రి రోడ్డులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను ఎస్పీ జానకితో కలిసి ఆమె తనిఖీ చేశారు. కాలేజీలోని వంట గది, స్టోర్‌రూంను, కూరగాయలు భద్రపరిచే గదులను ఆమె పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం, తాజా కూరగాయలు, ఆకుకూరలు అందించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. కలెక్టర్‌తో పాటు బీసీ సంక్షేమాధికారి ఇందిర, మహిళ శిశు సంక్షేమాధికారి జరీనాబేగం, జల వనరుల శాఖ డీడీ రమాదేవి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కౌసర్ జహాన్, మార్కెటింగ్ అధికారి బాలమణి, ప్రిన్సిపాల్ జయప్రద విద్యార్థినులతో కలిసి కాలేజీలోనే రాత్రి బసచేశారు.

క్లుప్తంగా

మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



నవాబుపేట: మైసమ్మ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం అమ్మవారికి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. వారం రోజులు జరిగే ఉత్సవాల్లో బాగంగా అమ్మవారిని పూజారులు ప్రత్యేకంగా అభిషేకాలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా దేవాలయానికి వచ్చిన భక్తులకు అన్ని ఏర్పాట్లుచేసినట్లు ఆలయ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, దేవాలయాధికారి మధనేశ్వర్‌రెడ్డి తెలిపారు.

చిన్నరాజమూర్‌లో అంజన్నస్వామికి..

దేవరకద్ర: మండలంలోని చిన్నరాజమూర్ ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల అనంతరం మూడోశనివారం జరిగిన పూజలకు భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. తహసీల్దార్ కృష్ణయ్య, ఆర్ఐ శరత్ దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం ఈఓ కవిత, అర్చకులు తహసీల్దార్‌ను శాలువతో సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు.

నిర్లక్ష్యం సరికాదు

నవాబుపేట: నర్సరీల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ జయరాం నాయక్ హెచ్చరించారు. శనివారం మండలంలోని కామారం, కాకర్‌జాల్‌తండా, చౌడూర్ గ్రామాల్లో ఆయన నర్సరీలు పరిశీలించారు. ఈసందర్భంగా నర్సరీ పనులు ముమ్మరం చేయాలని ఆదేశించారు. విత్తనాలు నాటడం వేగవంతం చేసి అధికారులు ప్రణాళిక ప్రకారం గ్రామాల్లో ఇళ్ల ముందు మొక్కలు నాటించాలన్నారు. ఆయన వెంట ఆయా గ్రామాల పంచాయతీ అధికారులున్నారు.

నేడు ముగ్గుల పోటీలు

స్టేషన్ మహబూబ్‌నగర్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కలం స్నేహం సాహిత్య సామాజిక సేవాసంస్థ ఆధ్వర్యంలో నేడు (ఆదివారం) ఉదయం 10 నుంచి 11 గంటలకు తెలంగాణ చౌరస్తాలోని ఆంజనేయస్వామి దేవాలయం ప్రాంగణంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గోపాల ఆచార్య, జిల్లా అధ్యక్షురాలు మేకల అనురాధ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



నవాబుపేట: మండలంలోని రాజాపూర్‌లో అయ్యప్ప పడిపూజను శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో రామకృష్ణ గురుస్వామి నివాసంలో ఏర్పాటుచేసిన పడిపూజ కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది. భక్తులు అధికసంఖ్యలో పూజలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన గురుస్వాములు, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

విజేతలకు బహూమతుల ప్రదానం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో శనివారం జోనల్ స్పోర్ట్స్‌మీట్ విద్యార్థులకు జిల్లా ఏజీఎం భాస్కర్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. స్పోర్ట్స్‌మీట్‌లో విద్యార్థులకు నిర్వహించిన క్రీడాపోటీల విజేతలకు బహుమతులు అందించినట్లు ప్రిన్సిపాల్ సజీలా పర్వీన్ తెలిపారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ రఘుబాబు, జోనల్ పీఈటీ రాము, డీన్ విజయవర్ధన్‌రెడ్డి, సిబ్యాచ్ ఇన్‌చార్జి స్రవంతి, పీఈటీ శ్రీకాంత్, సంధ్య పాల్గొన్నారు.

మైనార్టీలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్ర బడ్జెట్‌లో మైనార్టీల అభివృద్ధి కోసం ప్రత్యేకమైన బడ్జెట్ కేటాయించాలని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా అన్నారు. మైనార్టీల సంక్షేమానికి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరుతూ శనివారం ప్రధానమంత్రి కార్యాలయానికి మెయిల్ ద్వారా వినతిపత్రం పంపించినట్లు పేర్కొన్నారు. దేశ నలుమూలాల నుంచి మైనార్టీల స్థితిగతులను తెలుసుకోవడానికి ఒక కమిటీ వేయాలని కోరారు. ప్రధానమంత్రి 15 అంశాల కార్యక్రమాన్ని కొత్త విధానంలో అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మిడ్జిల్: తపస్‌కి సంబంధించి నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం ఎంఈఓ సుధాకర్, జీహెచ్‌ఎం సరస్వతీ, టీచర్ల సమక్షంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వెంకటేశ్వర్‌రెడ్డి, శివప్రసాద్, రాజేష్, రాజశేఖర్‌రెడ్డి, మంజుల, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

అధికారులు గ్రామాల్లో పర్యటించాలి



అధికారులతో మాట్లాడుతున్న దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్: మండల స్థాయి అధికారులు కార్యాలయానికే పరిమితం కాకుండా గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆదేశించారు. శనివారం మండలంలోని పోతులమడుగు శివారులోని ఇండోర్ మినీస్టేడియంలో మండల స్థాయి అధికారులు, 18 పంచాయతీలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, చేపట్టాల్సిన పనులపై ముఖ్యనాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యపై అనేక గ్రామాల నుంచి ఫిర్యాదులొస్తున్నాయని, కొన్నిచోట్ల మిషన్ భగీరథ నీటిసమస్య నెలకొందని అధికారులు వెళ్లి పరిష్కరించాలని అన్నారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకట్ నర్సింహారెడ్డి, మాజీఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, నాయకులు గోవర్దన్‌గౌడ్, విజయ్‌గౌడ్, హర్యానాయక్, తహసీల్దార్ రహమాన్, ఎంపీడీఓ ప్రభాకర్‌చారి, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

చిన్నచింతకుంట: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సాంబశివుడు కోరారు. శనివారం చిన్నచింతకుంట మండలం దమగ్నాపూరంలో నియోజకవర్గంలోని పంచాయతీ కార్మిక సంఘం నాయకులతో కలిసి ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కురుమయ్య, రాములు, నరసింహ, హనుమంతు, షద్రక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తేనే విజయం

కోయిల్‌కొండ: ఒత్తిడిని జయించినప్పుడే విద్యార్థి విజయం సాధిస్తాడని సైకాలజిస్ట్ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని గార్లపహాడ్ ఉన్నత పాఠశాలలో స్పందన ఈదా, వందేమాతరం ఫౌండేషన్ల ఆధ్వర్యంలో విద్యార్థులకు మూర్తిమత్వ నిర్మాణం, వ్యక్తిత్వ వికాసం కోసం శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు చదవడంలో ఎందుకు విఫలమవుతున్నారో, సమాజంలో మంచి మూర్తిమత్వ విలువలు కలిగిన పౌరులుగా తయారు ఎందుకు కావడం లేదో ఆయన వివరించారు. చదువుపై శ్రద్ధ కలిగేందుకు పలు సూచనలు, సలహాలు విద్యార్థులకు చేశారు. పాఠశాల హెచ్‌ఎం పవన్‌కుమార్, వందేమాతరం ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

జేపీఎన్‌ఈసీలో ఫ్రెషర్స్‌డే



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మండలంలోని జేపీఎన్‌ఈసీ కళాశాలలో శనివారం ఎంబీఏ విద్యార్థులు ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు విద్యార్థులు చేసిన డ్యాన్స్‌లు, సాంస్కృతిక నృత్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్యదర్శి వెంకట రామారావు, ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, సందీప్‌కుమార్, మధుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎస్‌ఆర్ శ్రీగాయత్రి విద్యాసంస్థలకు చెందిన చంద్రమౌళి పదో తరగతి విద్యార్థులకు శనివారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. హెచ్‌ఎం అనంతప్ప విద్యార్థులకు పలు సూచనలు చేశారు. టీచర్లు జరీనాబేగం, కిరణ్‌కుమార్, మల్లస్వామి, తిరుపతిరెడ్డి, జ్యోతి, కవిత, షర్మిల, మధుసూదన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌లో మండలంలోని బాదేపల్లి బాలుర జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి తులసివర్దన్ రెండో స్థానం, పెద్ద ఆదిరాల జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి జి.నవీన్ తృతీయస్థానం సాధించారు. ఇరువురు రాష్ట్రస్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌కు ఎంపికయ్యారు. వారిని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు చంద్రకళ, మల్లయ్యలతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

పీఏసీఎస్ ఏర్పాటు చేయాలని తీర్మానం

గండీడ్: మహమ్మదాబాద్ మండలానికి నూతనంగా పీఏసీఎస్ ఏర్పాటు చేయాలని పాలకవర్గం తీర్మానించింది. శనివారం గండీడ్ మండల కేంద్రంలో పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహమ్మదాబాద్‌కు కొత్తగా పీఏసీఎస్ ఏర్పాటు చేయాలని పలువురు డైరెక్టర్లు కోరారు. రుణమాఫీ అంశాలతో పాటు కొత్తరుణాలు, రుణాల రికవరీ వంటి అంశాలపై ఈసమావేశంలో చర్చించారు. అర్హులైన వారికి రుణాలివ్వడంతో పాటు పీఏసీఎస్ పురోగతికి కృషి చేయాలని పాలకవర్గం కోరింది. డీసీఓ శంకరాచారి, డీసీఏఓ వీరభద్రయ్య, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కమతం శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు మమత, వెంకటయ్య, దశరథఅశోక్, రాంరెడ్డి, చంద్రయ్య, బాలస్వామి, దాంబ్లానాయక్ ఉన్నారు.

బండ్లగేరిలో పనుల పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 28వ వార్డు పరిధిలోని బండ్లగేరిలో శనివారం మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీలైనంత త్వరగా సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులను ప్రారంభిస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు శాంతయ్య యాదవ్, లక్ష్మణ్‌నాయక్, రఘు, సత్యం పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్లు కేటాయించాలని ధర్నా



మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఇళ్ల స్థలాలు కోల్పోయిన నిర్వాసితులు

మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ అర్బన్ మండలం క్రిష్టియన్‌పల్లికి చెందిన నిర్వాసితులు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ముందు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాసితుల కమిటీ సలహాదారులు రాంమోహన్, గౌరవాధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, అధ్యక్షురాలు పార్వతమ్మ మాట్లాడుతూ క్రిస్టియన్‌పల్లి శివారు 523 సర్వేనంబర్‌లో 2004 సంవత్సరం నుంచి 2012 సంవత్సరం మధ్య కాలంలో అప్పటి ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్ల స్థలాలిచ్చిందని, గత టీఆర్ఎస్ ప్రభుత్వం ఆస్థలాలకు బదులు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని తెలిపారు. గత ప్రభుత్వంలో 887మంది పట్టా స్థలాలు కలిగిన పేదలను అర్హులుగా ప్రకటించారని అన్నారు. అందులో 387మందికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదని, మిగిలిన వారికి మౌలాలిగుట్ట దగ్గర డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని, లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వం ‘ఇందిరమ్మ’ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు రెండింట్లో ఏదో ఒకటి పేద ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. ధర్నాలో కమిటీ ప్రధాన కార్యదర్శి మంగమ్మై వహిదాబేగం, సాహిదాబేగం, మంజు, అనురాధ, భార్గవి, గోవిందమ్మ, రహిమాన్, షాహిన్‌బేగం పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న సుభాషిణికి బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఇటీవలి సావిత్రిబాయి పూలే రాష్ట్ర అవార్డును ప్రదానం చేశారు. శనివారం అవార్డు గ్రహీతకు ఎంవీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి కళాశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సత్యభాస్కర్‌రెడ్డి, రాజేందర్, శివప్రసాద్, రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మహమ్మదాబాద్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీఎస్ యూటీఎఫ్ నిరంతరం కృషిచేస్తోందని ఆసంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటయ్య, కరుణాకర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఎంఈఓ రాజునాయక్, సభ్యులు సాయన్న, గౌరమ్మ, దస్తయ్య, లాలయ్య, తిరుపతమ్మ, మహాలక్ష్మి, వరలక్ష్మి, మంజుల, పల్లవి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ



మిడ్జిల్: మండలంలోని రాణిపేట్ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు శనివారం భూమిపూజ చేశారు. గ్రామంలో కొన్ని రోజులుగా విగ్రహం ఏర్పాటుకు సంబంధించి స్థలం విషయంలో ఇబ్బందులు ఉండేవి. గ్రామ ప్రముఖులు వీటిని పరిష్కరించడంతో భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నిరంజన్, రాంచంద్రయ్య, అంజనేయులు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు టైగర్ జంగయ్య, శ్రీరాములు, కాంగ్రెస్ నాయకులు వెంకటయ్య, అల్వాల్‌రెడ్డి, గౌస్, విజయ్‌కుమార్, శంకరయ్య, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ

పాలమూరు: జడ్చర్లకు చెందిన ఎస్‌వీకేఎం పాఠశాల విద్యార్థులు శనివారం పట్టణంలోని రెడ్‌క్రాస్ సన్నిధి ఆశ్రమానికి రూ.1.50లక్షలు విలువచేసే నిత్యావసర సరుకులను వితరణ అందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ప్రేరణ ఆధ్వర్యంలో విద్యార్థులు కలిసి 20రకాల నిత్యావసర సరుకులను రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది పాఠశాల నుంచి విద్యార్థులు నిత్యావసర సరుకులు అందించడం అభినందనీయమన్నారు. డాక్టర్ శ్యామూల్, జగపతిరావు, రమణయ్య, తిరుపతి రెడ్డి, బాబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కులధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం

హన్వాడ: మదాసి కురువ, మదారి కురువ కులానికి ధ్రువీకరణపత్రాల జారీ జాప్యం జరుగుతోందని మదాసి కురువ, మదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. శనివారం ఆ సంఘం నూతన క్యాలెండర్‌ను ఉమ్మడి జిల్లా నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం రాష్ట్రనాయకులు బాల్‌రాజు, బెన్ని వెంకటేష్, రాజోలి వెంకటేష్, శ్రీనివాసులు, ఆంజనేయులు, బండరి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యావకాశాలు కల్పించడమే లక్ష్యం



మహమ్మదాబాద్‌లో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు

- హామీలు నెరవేర్చేందుకు కృషి
- పరిగి ఎమ్మెల్యే టీ.రామ్మోహన్‌రెడ్డి
- కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

గండీడ్: అన్నివర్గాల వారికి విద్యావకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టీ.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బాలికలు చదువుకు దూరంగా ఉండకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం ఇలాంటి అవకాశాలు కల్పిస్తుందని అన్నారు. బాలికలు వీటిని సద్వినియోగం చేసుకుని విద్యలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఎంఈఓ జనార్దన్, ఎస్‌ఓ శివలీల, పుల్లారెడ్డి, నర్సింహారావు, శ్రీనివాస్‌రెడ్డి, బాలస్వామి, ఆశన్న పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తోందని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టీ.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయా గ్రామాల మహిళలకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం పీఆర్‌టీయూటీఎస్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థికసాయం అందించేందుకు సీఎం ఓఅన్నలా ఆదుకుంటున్నారన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషిచేస్తుందని, ఇప్పటికే అర్హులైన వారికి ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇచ్చినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కేఎం నారాయణ, డీసీసీబీ మాజీ చెర్మన్ కమతం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాధారెడ్డి, ముకుందం, గిరిధర్‌రెడ్డి, విష్ణు, చెన్నయ్య, అనంతయ్యగుప్త, సాయితేజారెడ్డి, జునైద్, లక్ష్మీకాంత్‌రెడ్డి, రహీం, పీఆర్‌టీయూటీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు భీంరెడ్డి, పుట్టిశ్రీను, రాములు, బాల్‌రాజ్, పాల్గొన్నారు.

డప్పు కళాకారుల ప్రచార రథయాత్రలు



మహబూబ్‌నగర్ రూరల్: హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు వెయ్యి గొంతుల మహా కళా ప్రదర్శన విజయవంతం చేయడం కోసం ఈనెల 7న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో డప్పు కళాకారుల ప్రచార రథయాత్రలు ప్రారంభిసస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ డప్పు స్వామి అన్నారు. శనివారం స్థానిక బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో డప్పు కళాకారుల జిల్లా కళా నేతలు, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాకళా ప్రదర్శనకు ప్రతిఒక్క మాదిగ బిడ్డ ఒక డప్పు కొనాలి, ప్రతి ఇంట్లో ఒక డప్పు ఉండాలి అనే నినాదంతో మహబూబ్‌నగర్ జిల్లా నుంచి మొదలు కొని నారాయణపేట జిల్లా వరకు రథయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ యాత్ర తెలంగాణ చౌరస్తాలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడి నుంచి అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకుని అక్కడ దండోరా జెండాలు ఎగురవేసి డప్పు కళాకారుల రథాలను ప్రారంభిస్తారన్నారు. 200 డప్పు కళాకారులు ఆటాపాటలతో ప్రచార రథం ముందు పోరాటయోధులను స్మరిస్తూ పాటలు పాడుతూ ఊరేగింపు కొనసాగుతుందన్నారు. మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు టైగర్ జంగయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, నాయకులు బాలయ్య, రామచంద్రయ్య, రాములు, శేఖర్, కృష్ణ, శివకుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు పురుషోత్తం



జడ్చర్ల టౌన్: మతిస్థిమితం కోల్పోయి సత్యేశ్వర ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న మానసిక దివ్యాంగుడు పురుషోత్తం శనివారం సీఐ ఆదిరెడ్డి సమక్షంలో కుటుంబ సభ్యుల చెంతకు చేరాడు. ఆరేళ్లక్రితం సత్యేశ్వర ఆశ్రమ వాసులకు రోడ్డుపై మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్న పురుషోత్తం తారసపడ్డాడు. అతడిని ఆశ్రమానికి తీసుకువచ్చి సపర్యలు చేస్తూ ధ్యానం, యోగాసనాలు వేయిస్తూ చికిత్స అందించటంతో ఇటీవల కోలుకున్నాడు. తనది బెంగళూరు అని తెలపడంతో వివరాలు సేకరించారు. ఆధార్‌కార్డు ద్వారా వివరాలు తెలుసుకుని సీఐ ఆదిరెడ్డికి సమాచారమందించి కుటుంబసభ్యులతో మాట్లాడించి వారిని రప్పించి అప్పగించారు. ఆశ్రమ నిర్వాహకులు చిత్తనూరి ఈశ్వర్, రామకృష్ణ పాల్గొన్నారు.

కల్యాణమండప నిర్మాణానికి రూ.2.51లక్షల విరాళం



జడ్చర్ల టౌన్: మండలంలోని మీనాంబరం పరుషవేదీశ్వర స్వామి ఆలయంలో నిర్మించనున్న కల్యాణ మంటపం కోసం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న బుద్దసముద్రం గ్రామస్తులు నాగహైమావతి, మహాలింగం దంపతులు రూ.2.51లక్షలు విరాళంగా అందజేశారు. శనివారం వారు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోపాల్‌కు చెక్‌ను ఇచ్చారు. అభివృద్ధి కమిటీ సభ్యులు కైలాస్ జువార్, పుట్ట పర్వతాలు, చెన్నయ్య, భజనమండలి అధ్యక్షుడు దామోదర్, నర్సింహులుగౌడ్ పాల్గొన్నారు.

మహనీయుడు లూయిస్ బ్రెయిలీ

మహబూబ్‌నగర్ రూరల్: అంధుల కోసం ప్రత్యేక లిపిని కనిపెట్టి విజ్ఞాన జ్యోతిని వెలిగించిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని జిల్లా స్త్రీ, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి జరీనాబేగం అన్నారు. లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకొని శనివారం స్థానిక టీఎన్జీఓ భవనంలో ఉద్యోగులు, అంధుల ఆశ్రమ పాఠశాల విద్యార్థుల సమక్షంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంధులకు చేతి కర్రలు, స్మార్ట్‌కేస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ సేవలు చిరస్మరణీయమని అన్నారు. ప్రభుత్వం అంధుల కోసం ప్రత్యేక పథకాలు అమలు చేస్తుందన్నారు. డీఎంహెచ్‌ఓ కృష్ణ, లీడ్‌బ్యాంకు మేనేజర్ భాస్కర్, డీపీఎం కిష్టయ్య, అంధుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ రాములు, అంధుల సంఘం నాయకులు ముంతాజ్, డా.హరీష్, రాజవర్ధన్ ఉన్నారు.